జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 15 | మే | 2026 • పేజీలు : 10

## చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14, ప్రజా జ్యోతి:** రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.గురువారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల నుంచి జరిగే

మిగతా 2 లో...




# కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

### పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ధాన్యం కొనుగోళ్ల కోసం 22 వేల కోట్లు కేటాయింపు
- హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు
- వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ధాన్యం రవాణా కోసం వినియోగం
- ఖమ్మం ఐడీఓసీలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 14, (ప్రజా జ్యోతి)** కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనీ సాంబ శివరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,575 కొనుగోలు

మిగతా 2 లో...



# రైతు ఏ పంట పండించిన మద్దతు ధరకుకొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ

- కేంద్ర ప్రభుత్వం రైతులతో రాజకీయం చేస్తోంది
- ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా నిలబడ్డారు.
- సైకిల్ కూడా వెళ్లలేని గ్రామాలకు నా గిరిజన బిడ్డలు ఈరోజు బెంజ్ కార్ లో వెళ్తున్నారు
- 23 జిల్లాల మంత్రులు పోటీ పడిన పూజ్యులు ఎన్టీఆర్ నాకు వ్యవసాయ కళాశాలను ఇచ్చారు.
- మీ బిడ్డలు చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటే నా హృదయం నిండిపోతుంది.... తుమ్మల నాగేశ్వరావు...రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి
- విజయవంతమైన రైతుల ఆత్మీయ సమ్మేళనం, తరలివచ్చిన 15 జిల్లాల రైతులు
- మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తుమ్మలను సత్కరించి, అభినందించిన రైతులు
- వ్యవసాయ కళాశాల మీ దూర దృష్టికి నిదర్శనం
- ఆయిల్ ఫామ్ కు ఆయనే ఆరాధ్యుడు .... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

6 లో...

# అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

### పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, మే 14, (ప్రజాజ్యోతి) :** ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్

మిగతా 2 లో...



# దేశ, విదేశాల నుంచి భద్రాచలం వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు

- భద్రాచలంను పుష్కరాలకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి
- పుష్కర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తుంటాం
- గోదావరి పుష్కరాల సమీక్ష సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**భద్రాచలం, మే 14, ప్రజాజ్యోతి:** భద్రాచలంలో వచ్చే ఏడాది జూలై నెలలో జరిగే గోదావరి పుష్కరాలకు దేశ విదేశాల నుండి భక్తులు తప్పనిసరిగా గోదావరి నదిలో స్నానం ఆచరించి శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకొని వారి గమ్యస్థానాలకు వెళుతుంటారని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు ఘనంగా చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం నాడు శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వసతి గృహములో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదేం వీరయ్య,ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ,

మిగతా 2 లో...

## అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గ పరిధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు వీలైనంత అందుబాటులోకి తీసురావాలని చెప్పారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనుల విషయంలో సంబంధిత శాఖ మంత్రులతో మాట్లాడి అనుమతులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం మరియు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అంతేకాకుండా పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్, సబ్ ఇంజనీర్ రాజు, సహాయ ఇంజనీర్లు శ్రీకాంత్, ప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

## చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ రోహిత్ రాజు



(మొదటి పేజీ తరువాయి...)

పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## దమ్మపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కక్కిరాల రమేష్

- **పార్టీ బలోపేతానికి కృషి చేస్తా : కక్కిరాల రమేష్**



**దమ్మపేట, మే 14 (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శ్రీ కక్కిరాల రమేష్ నియమితులవడం పట్ల మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే తత్వాన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కక్కిరాల రమేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని, గ్రామ స్థాయి నుండి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తానని అన్నారు.మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, కార్యకర్తలకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే పార్టీ అభివృద్ధికి కృషి చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగుతానని, అందరినీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శ్రీ కక్కిరాల రమేష్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి...)

కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లు సిద్ధంగా ఉంచిందని తెలిపారు.ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 4 వేల 800 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు 45 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తారని, ప్రస్తుతం అక్కడి పరిస్థితుల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందన్నారు. తీవ్ర ఎండల కారణంగా కూడా కొంతమంది హమాలీలు పగటి వేళల్లో పనిచేయలేక పోతున్నారని . సమస్య పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు, రవాణా సమస్య పరిష్కారం కోసం వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ప్రధానంగా ధాన్యం రవాణాకే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇసుక, సిమెంట్ తదితర రవాణాపై నియంత్రణ విధించి ధాన్యం తరలింపుకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈసారి పంట దిగుబడి భారీగా పెరగడంతో నిల్వ సమస్య కూడా ఎదురవుతోందన్నారు. అదనపు గోదాములు, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తేమ శాతం మించకుండా, శుభ్రమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. క్వింటాల్‌కు ఐదు, ఆరు కిలోల వరకు అక్రమ కటింగ్‌లు చేస్తున్నారనే సమాచారం వస్తోందని, ఇది ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ప్రభుత్వం కొంత నష్టాన్ని భరించేందుకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం కనీస మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందించడంతో రైతులు రికార్డు స్థాయిలో వరి సాగు చేశారని తెలిపారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోళ్లు కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందని, రైతులు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. “చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది” అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో తాలు, తరుగు, కటింగ్‌లు అసలు ఉండకూడదని ఇప్పటికే కఠిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా రైస్ మిల్లర్లు అక్రమంగా కటింగ్‌లు చేస్తే ఆయా రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లాలో మొత్తం 167 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 72,555 ఎకరాల్లో సుమారు 2.07 లక్షల మెట్రిక్ టన్నుల వరి సాగు జరిగిందని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 23,300 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు కేంద్రాలకు చేరుకోగా, 12,596 మెట్రిక్ టన్నుల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇంకా 9,704 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరగాల్సి ఉందని తెలిపారు . అధిక ఉష్ణోగ్రతల కారణంగా హమాలీల కొరత, లోడింగ్ సమస్యలు తలెత్తినప్పటికీ స్థానిక హమాలీలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు . రవాణా, ప్రత్యామ్నాయ నిల్వలకు తగినన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అవసరమైన కొనుగోలు కేంద్రాల్లో పోలీస్ శాఖ సహకారంతో కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న 20 రోజుల్లో వరి కొనుగోలు ప్రక్రియను పూర్తిస్థాయిలో వేగవంతం చేసి పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో 309 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకు 94,961 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా, అందులో 80 వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి గోదాములకు తరలించినట్లు వివరించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తైన రెండు రోజులలోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. . రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తున్న ప్రభుత్వం ఇదేనని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం చివరి గింజ వరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన కొత్తగూడెం ఎస్పీ బి. రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ, విదేశాల నుంచి భద్రాచలం వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి...)

సర్పంచ్ పూణేం కృష్ణ ఇతర శాఖల అధికారులతో కలిసి రాబోయే గోదావరి పుష్కరాలకు చేపట్టవలసిన కార్యాచరణ గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కొన్ని సూచనలు ఇస్తూ గోదావరి పుష్కరాలు దగ్గర పడుతున్నందున ప్రతి శాఖ అధికారి భద్రాచలం అభివృద్ధికి పాటుపడాలని, భద్రాచలం పట్టణంతో పాటు పరిసరాలు , వార్డులు సర్వ సుందరంగా ఉండేలా చూడాలని, శానిటేషన్ పరంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జూన్ జూలై మాసాలలో కరకట్ట ప్రదేశాలలో నర్సరీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, లైట్లు విద్యుత్ సౌకర్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్యం కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటింటికి తిరిగి సేకరించిన తడి చెత్త పొడి చెత్త డంపింగ్ యార్డ్ కి తరలించిన తర్వాత ఎరువుల తయారీతో పాటు గ్యాస్ ఉత్పత్తి కూడా చేయవచ్చని అందుకు తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసుకుని సమర్పించాలని అన్నారు. చెత్తను రోడ్డుమీద వేస్తే జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు గోదావరి వరద ముంపునకు గురి అయ్యే గ్రామాలను దృష్టిలో పెట్టుకొని షట్టర్ల రిపేరు చేయించుకోవాలని, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి సి నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఇరిగేషన్ డి ఈ వెంకటేశ్వర్లు, తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, జిపి ఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**››› భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి తుమ్మల**

రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం నాడు స్వామి వారి దర్శనానికి వచ్చిన ఆయనకు దేవస్థానం ఈవో దామోదర్ రావు మరియు అర్చక స్వాములు దేవస్థానం సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా బలపీఠం వద్ద పూజలు నిర్వహించి, గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మవారిని, ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామి వారి పట్టు వస్త్రాలు మరియు జ్ఞాపికను అందించి స్వామివారి విశిష్టతను తెలిపి తీర్థప్రసాదాలు అందించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి క్షేత్రం దక్షిణ భారతదేశానికి కాకుండా ప్రపంచమంతటికి శ్రీరాముడు అంటే భద్రాద్రిగా ప్రతి ఇంట్లో ప్రతి గ్రామంలో ఆయన గారి కళ్యాణం చేసుకునేటువంటి కలియుగ రాముడు శ్రీ సీతారామచంద్ర స్వామి అని అన్నారు. భద్రాద్రి రాములు గారి సన్నిధిలో 1986 ఎన్టీ రామారావు సీఎంగా ఉన్న సమయంలో భద్రాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని అంతేకాకుండా 1986 మే 14న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని, ఏ ప్రభుత్వంలో ఉన్న భద్రాచలం పట్టణం కోసం, మన్యం ప్రాంతాల కోసం, దేవస్థానం అభివృద్ధి కోసం కృషిచేశానని అన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం పునరుద్ధరణ కార్యక్రమాలు ఈ నెలలో ప్రారంభమవుతాయని, సుమారు 350 కోట్ల రూపాయలు ఈ క్షేత్రం యొక్క అభివృద్ధి కోసం ఆయన చేతుల మీదుగా భూమి పూజ చేయడం జరిగిందని, ఈ నెలలోనే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, పూర్తిగా ఆగమ శాస్త్ర ప్రకారము వేద పండితుల ఆలోచనకు అనుగుణంగా ఈ క్షేత్రం అభివృద్ధి జరగాలని, భద్రాద్రి పుణ్యక్షేత్రం పూర్తిస్థాయిగా అభివృద్ధి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులతో త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. అలాగే భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులతో పాటు పర్ణశాల లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కూడా భక్తులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయిస్తామని, ఈ నెలలో దేవస్థానం, ఇరిగేషన్, ఆర్ అండ్ బి ముఖ్యమైన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన అన్ని పనులు భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా పనులు ప్రారంభించి పుష్కరాల నాటికి పూర్తి కావాలని అలాగే ప్రసాద్ పథకానికి సంబంధించిన పనులు పుష్కరాల పనులకు ఆటంకం కలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సోడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, సర్పంచ్ పూణెం కృష్ణ భద్రాచలం తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థుల్లో ఆందోళన

- **మళ్లీ పరీక్ష ఎలా ఉంటుందోనన్న భయం**
- **ఆర్థిక భారంపై తల్లిదండ్రుల ఆవేదన**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 14(ప్రజా జ్యోతి):** వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఈ నెల 3న నిర్వహించిన నీట్ పరీక్ష ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ) రద్దు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రాజస్థాన్ లో ప్రశ్నాపత్రం లీక్ అయిందనే ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఎన్ టీఏ ప్రకటించింది. దీంతో మళ్లీ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు..? పరీక్ష విధానం ఎలా ఉంటుంది..? అనే అనిశ్చితి విద్యార్థులను కలవరపెడుతోంది.దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకాగా, జిల్లావ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయంలో పరీక్ష రద్దు వార్త రావడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎక్కడో ఒక రాష్ట్రంలో జరిగిన పేపర్ లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా పరీక్ష రద్దు చేయడం సరైంది కాదని పలువురు విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

### ››› విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినే ప్రమాదం///

నీట్ పరీక్ష కోసం విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమయ్యారు. ఇంటర్ చదువుతో పాటు ప్రత్యేక కోచింగ్ తీసుకుంటూ లక్ష్యసాధన కోసం శ్రమించారు. కొందరు ఇప్పటికే ఒకసారి పరీక్ష రాసి ఆశించిన ర్యాంకు రాకపోవడంతో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని మరోసారి పరీక్షకు హాజరయ్యారు. ఇప్పుడు పరీక్ష రద్దు కావడం తో విద్యార్థుల్లో నిరుత్సాహం పెరిగింది. కేంద్ర ప్రభుత్వం పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించినప్పటికీ, ఇప్పటికే విద్యార్థులకు మానసికం గా నష్టం జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా నీట్ పేపర్ లీకేజీపై ఆరోపణలు రావడంగమనార్హం. దీంతో భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల పారదర్శకతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› లక్షల్లో ఖర్చు చేసిన తల్లిదండ్రులు///

జిల్లాకు చెందిన అనేక మంది విద్యార్థులు హైదరాబాద్ వంటి నగరాల్లో ఇంటర్మీడియట్ చదువుతూ నీట్ కోసం ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. కోచింగ్ సెంటర్లలో సీట్లు, హాస్టల్, పుస్తకాలు, పరీక్షా ఫీజులు తదితరాల కోసం తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ముఖ్యంగా మధ్యతరగతి, పేద కుటుంబాలకు ఇది పెద్ద ఆర్థిక భారంగా మారింది. ఇప్పుడు పరీక్ష రద్దు కావడంతో వారి శ్రమ, ఖర్చు అన్నీ వృథా అయ్యాయనే భావన వ్యక్తమవుతోంది.

### ››› ఆత్మవిశ్వాసం కోల్పోవద్దంటున్న నిపుణులు///

మళ్లీ పరీక్ష నిర్వహణపై త్వరలోనే ఎన్ టీఏ స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని, విద్యార్థులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా తిరిగి సిద్ధం కావాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు పేపర్ లీకేజీ ఘటనపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

### ››› ఎంతో కష్టపడి చదివా.. ఇప్పుడు బాధగా ఉంది

: చెరుకు సౌజన్య లత ,బైపీసీ విద్యార్థిని



ఇంటర్ తో పాటు నీట్ పరీక్ష కోసం ఎంతో కష్టపడి సిద్ధమయ్యాను. మంచి మార్కులు వస్తాయని ఆశపడ్డాను. కానీ ఎక్కడో జరిగిన లీకేజీ కారణంగా పరీక్ష రద్దు కావడం చాలా బాధగా ఉంది. ఏడాది పాటు చేసిన శ్రమ వృథా అయినట్టుగా అనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది.

### ››› మళ్లీ పరీక్ష అంటే భయంగా ఉంది:

యం గాయత్రి ,బైపీసీ విద్యార్థిని



పగలు, రాత్రి కష్టపడి పరీక్ష రాశాను. మంచి ర్యాంకు వస్తుందనే నమ్మకం ఉండేది. ఇప్పుడు పరీక్ష రద్దు కావడంతో శ్రమంతా వృథా అయినట్టైంది. మళ్లీ పరీక్ష నిర్వహిస్తే మరోసారి లీక్ జరగదన్న నమ్మకం కూడా లేదు. మళ్లీ సిద్ధం కావడం చాలా ఇబ్బందిగా ఉందని తెలిపింది.

## మంత్రికి ఒక న్యాయం సామాన్యులకు ఒక న్యాయమా

- **బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలి**
- **ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి సీతాలక్ష్మి**

**భద్రాచలం టౌన్, మే 14 ప్రజాజ్యోతి** అత్యాచారం లైంగిక దాడి కేసులలో మంత్రి కుటుంబ సభ్యులకు ఒక న్యాయం సామాన్యులకు ఒక న్యాయం ఉంటుందా అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డి సీత లక్ష్మి ప్రశ్నించారు. భద్రాచలంలో గురువారం బండి భగీరథని అరెస్టు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళ సఘం ఆద్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో సీతాలక్ష్మి మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడి పైన ఫోక్సో కేసు నమోదై వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికి అరెస్టు చేయకుండా నోటీసులు ఇవ్వడాన్ని ప్రశ్నించారు. ఇటువంటి కేసులలో సామాన్యుల కుటుంబ సభ్యులు ఉంటే వెంటనే అరెస్టు చేసి విచారించడం ఒకవేళ నిందితుడు తప్పించుకొని పోతే అతని కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకునే పోలీసులు బండి సంజయ్ ని ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. బేటి బచావో అనేదనాదం చేసే మోది తన క్యాబినెట్ సాహ్య మంత్రి కుమారుడు మైనర్ బాలికపై అత్యాచారం చేస్తే స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథుని తప్పించిన సంజయ్ కుటుంబ సభ్యులపై కూడా కేసును నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు న్యాయం జరిగేంతవరకు ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమిస్తుంటామని సీత లక్ష్మి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కనక శ్రీ రమణ రాధ ఎస్ కే చోటిమా హైమావతి పద్మ జి నాగలక్ష్మి ఎం వేగం ఎస్ కే దేవి కొమరం రుక్మిణి తదితరులు పాల్గొని బండి సంజయ్ కుమారుని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు.



## పినపాక మండలంలో విద్యా వారోత్సవాలు ప్రారంభం

- **ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహణ**




**పినపాక,మే 14(ప్రజాజ్యోతి ):** పినపాక మండలంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఎంఈఓ నాగయ్య తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పినపాక మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు – తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన, రెండు జతల యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, కంప్యూటర్ విద్య, యోగ, కరాటే శిక్షణ, బాలికలకు సైకిళ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.అలాగే వారంలో మూడు రోజులు గుడ్డు, మూడు రోజులు రాగి జావా అందిస్తున్నారని, ఈ విద్యా సంవత్సరంనుంచి 11 వస్తువులతో కూడిన కిట్ ను కూడా విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఒత్తిడి లేని విద్యను బోధిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమాల్లో మండల విద్యాధికారి కొమరం నాగయ్య, ప్రధానోపాధ్యాయులు కె. రమణ, కె. విజయలక్ష్మి, టి. మాధవరావు, గ్రామ సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా లక్కినేని శ్యాంబాబు నియామకం



**టేకుల ప ల్లి, మే1 4 , ప్రజాజ్యోతి:** ఇల్లందు నియోజకవర్గంలో టేకుల పల్లి మండ ల కాంగ్రెస్ అధ్యక్షునిగా లక్కినేని శ్యామ్ బాబును నియమిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు.ఈ నియామక పత్రం జిల్లా అధ్యక్షులు తోట దేవిప్రసన్న చేతుల మీదుగా అందుకున్నారు.నూతన అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా అధ్యక్షుడు దేవి ప్రసన్న కు కృతజ్ఞతలు తెలిపారు. తనపైన నమ్మకం ఉంచి మండల పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాకర్తలు నాయకులు సమస్యలు పరిష్కరించడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

## భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పరిమి శ్రీనివాసరావు నియామకం

- **పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన పరిమి శ్రీనివాసరావు**



**భద్రాచలం, మే 14, ప్రజా జ్యోతి :** భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి పరిమి శ్రీనివాసరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నతో పాటు భద్రాచలం డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పరిమి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరిమి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆడబిడ్డ పెళ్లికి 'సర్పంచ్ సురేష్ ' భరోసా

- **గ్రామంలోని ఆడపిల్ల పెళ్లికి మేనమామ కట్నంగా రూ.5,116 అందజేత**



**టేకులపల్లి,మే14, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం మొక్కంపాడు తండ సర్పంచ్ బానోత్ సురేష్ పంచాయతీ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన మాట ప్రకారం కీలక హామీ అయిన ఆడబిడ్డ పెళ్లి కానుకను గురువారం అందించారు. గ్రామానికి చెందిన బానోత్ వెంకన్న, జ్యోతిల కూతురు మాధురి వివాహంగురువారం జరిగింది.సర్పంచ్ పెళ్లికి హాజరై మేనమామ కానుకగా రూ.5,016 నగదు అందించారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ గ్రామస్తులకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తానని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ హామీ ఇవ్వని పనులు కూడా చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లూరి పంచాక్షరయ్యను కలిసిన మంత్రి తుమ్మల



**బూర్గంపహాడ్, మే 14 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామానికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్టు చైర్మన్ పంచాక్షరయ్యను రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాద్రి పర్యటనకు వచ్చిన ఆయన శ్రీసీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న అనంతరం నేరుగా ఇరవెండిలో ఉన్న పంచాక్షరయ్య నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మలను పంచాక్షరయ్య సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి అనంతరం జ్ఞాపికను అందజేశారు. అనంతరం తుమ్మల తాళ్లూరితో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజాసమస్యలు, అభివృద్ధి తదితర అంశాలపై కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, తాళ్లూరి రాధాకృష్ణ, తాళ్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోసల గ్రాండ్ ఓపెనింగ్

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరావు, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య



**భద్రాచలం టౌన్, మే 14 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని బ్రిడ్జి సెంటర్, లారీ ఆఫీస్ పక్కన అత్యాధునిక అంగులతో నిర్మించిన కోసల గ్రాండ్ ఓపెనింగ్ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రిబ్బన్ కట్ చేసి కోసల గ్రాండ్ నీ ప్రారంభించారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటరావు, అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోసల గ్రాండ్ నిర్వహకులు చల్లగుళ్ళ నాగేశ్వరరావు వారికి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## కారు ఈడ్చుకెళ్లిన ఘటనలో వ్యక్తి మృతి



**టేకులపల్లి,మే14, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మూడ్ తండాకు చెందిన మూడ్ నాగేష్ ఈ ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి సుమారు 11 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి కారు లో వచ్చి టేకులపల్లి బస్టాండ్ సెంటర్ లో ఆక్సిడెంట్ చేసి కారు తో పాటు నాలుగు కిలోమీటర్ల మేర సులానగర్ వరకు ఈడ్చుకుంటూ వెళ్లడని పలువురు వాహన దారులు చెప్తున్నారు. కుటుంబ సభ్యులు టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా, కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలనీ పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదుచేసి మూడ్ నాగేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

# లాటరీ పద్ధతిలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థుల ఎంపిక

- పాల్గొన్న భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, మే 14 ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ పరిధిలో నడుస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన బాల బాలికలకు గురువారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో బి.రాల్ సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో బి.రాల్ మాట్లాడుతూ ఎంపిక కమిటీ సభ్యుల సమక్షంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా అందరి సమక్షంలో లాటరీ ద్వారా బాల బాలికలను ఎంపిక చేశామని అన్నారు. డ్రాలో సీటు వచ్చిన పిల్లలు ఆయా తరగతులలో చేరకపోతే వెయిటింగ్ లిస్టులో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయించబడతాయని ఆయన అన్నారు. పిల్లల యొక్క తల్లిదండ్రులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో సీట్లు సంపాదించిన పిల్లలను తప్పనిసరిగా చేర్పించాలని తెలుపుతూ, సీట్లు లభించిన బాల బాలికలకు ఆయన అభినందిస్తూ, బాగా చదివి మీ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, సి ఓ ఈ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఏ సి ఎం ఓలు రమేష్, రాములు, ఏటీడీవో సత్యవతి,డిడి ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం సిబ్బంది రామకృష్ణారెడ్డి, పాషా, రంగయ్య, ప్రసాద్, శ్రీధర్, మణికుమార్, సురేష్, భద్రం మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తన ఉత్పత్తి పై అవగాహన



**టేకులపల్లి,మే14,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బేతపూడి గ్రామం వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. టి. భరత్ గురువారం రైతులకు వితనోత్పత్తి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా. టి. భారత్ మాట్లాడుతూ రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న వరి రకాలు ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వా విద్యాలయం వారు విడుదల చేసిన రకాలను ఎంచుకొని సాగు చేసుకోవాలని చెప్పారు.అలాగే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వావిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం సాంకేతిక సహకారంతో వరి,కందిలో విత్తన ఉత్పత్తి చేపడుతున్న వివరాలు రైతులకు తెలిపారు. పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్రావు మాట్లాడుతూ రైతులు పోటీతత్త్వంతో మోతాదుకు మించి ఎరువులను వాడకం చెయ్యడం వలన భూసారం తగ్గిపోతుందని తెలియపరి చారు.పచ్చిరొట్ట పైర్లు జీలుగ, జనుము,పిల్లిపెసర,పెసర, మినుము వంటి వాటిని సాగు చేసుకొని పచ్చిరొట్ట పైర్లుగా వాడుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ మాట్లాడుతూ రైతులు ఒకే రకమైన పంటలను పండిస్తు న్నారు.అందువలన రైతులకు కూడా గిట్టుబాటు కావడం లేదు. కనుక రైతులు పంట మార్పిడి పాటించడం ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందటంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ సీఈఓ,సభ్యులు,అభ్యుదయ రైతులు,40 మంది రైతులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుంచి కోలేటి భవానీ శంకర్ సస్పెన్షన్

**పినపాక, మే 14(ప్రజాజ్యోతి):** పార్టీ కార్యకలాపాలు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు పినపాకకు చెందిన కోలేటి భవానీశంకర్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పినపాక మండల బీఆర్ఎస్ అడహాక్ కమిటీ ప్రకటించింది.గురువారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన ముఖ్య కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల అడహాక్ కమిటీ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ మంత్రిని ప్రశంసిస్తూ ప్రెస్‌నోట్లు విడుదల చేయడం, ప్రెస్‌మీట్లు నిర్వహించడం పార్టీ వ్యతిరేక చర్యగా గుర్తించామని తెలిపారు.అలాగే ఇతర మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులకు ఫోన్లు చేసి కాంగ్రెస్ పార్టీ మంత్రిని కలవాలని, సంబరాల్లో పాల్గొనాలని కోరడం కూడా తప్పుగా నిర్ధారించామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ మంత్రిని పొగడడం, ప్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్లనే భవానీశంకర్‌పై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.భవిష్యత్తులో కూడా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై కోలేటి భవానీశంకర్‌కు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పొనుగోటి భద్రయ్య, దాట్ల వాసుబాబు, పీఏసీఎస్ చైర్మన్ రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, గుమ్మడి గాంధీ, రాయల బాబు, బత్తుల వెంకటరెడ్డి, దొడ్డా శ్రీనివాస్ రెడ్డి, కొండేరు నాగభూషణం, ముక్కు నాసర్ రెడ్డి పాల్గొన్నారు.



## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**చర్ల, మే 14(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని సింగసముద్రం గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. గ్రామానికి చెందిన ఇర్పా ధర్మరాజు నివాసంలో ఉదయం సుమారు 3 గంటల సమయంలో అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగానే ఇంటి నుంచి పొగలు, మంటలు రావడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో ఇంటిలో ఉన్న గృహోపకరణాలు, దుస్తులు, ధాన్యం, తదితర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.ఈ ప్రమాదంతో నిరుపేద కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. కష్టపడి నిర్మించుకున్న ఇల్లు క్షణాల్లో కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రస్తుతం వారికి ఉండటానికి కూడా ఆశ్రయం లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు.ఈ ఘటనపై స్థానిక ప్రజలు స్పందిస్తూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరుతున్నారు. అలాగే దాతలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## రెండు ఫోటోలు విధానం రద్దు చేయాలి



**చర్ల, మే 14 :(ప్రజాజ్యోతి):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం చర్ల మండలంలోని మొగల్లపల్లి, జీపీ పల్లి గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధి పని కేంద్రాలను వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, మండల నాయకులు దొడ్డి హరినాగవర్మ సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి కార్మికులకు నష్టం కలిగించే విధంగా విబిజి రామ్‌జి చట్టాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు దుర్మార్గమని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తున్నారని అన్నారు.గతంలో ఉపాధి హామీ పథకానికి 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించేదని ప్రస్తుతం కేవలం 60 శాతం మాత్రమే కేటాయిస్తూ మిగిలిన 40 శాతం రాష్ట్రప్రభుత్వాలు భరించాలని కేంద్రం చెబుతోందని విమర్శించారు.పని ప్రదేశాల్లో కార్మికులకు మెడికల్ కిట్, నీడ కోసం టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. రెండు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.మే 15న దేశవ్యాప్తంగా నిర్వహించే ఉపాధి కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల నుంచి ఉపాధి కార్మికులు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు శ్యామల లక్ష్మయ్య, మచ్చ నాగేశ్వరావు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగలను శాంతియుతంగా చేసుకోవాలి

- సీఐ బత్తుల




**టేకులపల్లి,మే14,ప్రజాజ్యోతి:** రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో హిందూ,ముస్లిం మత పెద్దల తో సీఐ బత్తుల సత్యనారాయణ శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం దెబ్బ తీసే విధంగాఎవరూ ప్రవర్తించరాదని, పరస్పరం గౌరవ భావంతో వ్యవహరించాలని ఆయన కోరారు.పశువుల అక్రమ రవాణా నివారించేందుకు టేకులపల్లి మండల వ్యాప్తంగా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పండుగల సందర్భంగా నిర్వహించే ఊరేగింపులు, ప్రార్థనలు, ఇతర కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలన్నారు.

**గ్రామపంచాయతీ కార్యదర్శులకు**

పశువుల వయసును దృష్టిలో పెట్టుకొని వెటర్నరీ డాక్టర్ సలహాలు తీసుకొని వారి సలహాల మేరకు గ్రామపంచాయతీ తరఫునుంచి పశువులు కొనుగోలు చేసిన వారికి రసీదు రాసి ఇవ్వాలని వారికి తెలిపారు. ఇష్టారాజ్యముగా రాసినచో గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఎస్సై అల్లకుంట రాజేందర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ అనిల్, మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, హిందూ, ముస్లిం కుల పెద్దలు, పశువుల వ్యాపారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్‌లో భూ వివాదం కలకలం

- స్థలం చుట్టూ ఉన్న ఇనుప ఫెన్సింగ్, పోల్స్ ధ్వంసం
- ఖాళీ జాగా చుట్టూ రాజకీయ ఎత్తుగడలు..?
- అమ్ముకున్న భూమిపై వారసుల హక్కుల పోరు
- రెండు నెలలుగా వివాదాలకు కేంద్రంగా మారిన వార్డు మెంబర్ తీరు









**కొత్తగూడెం, మే 14 (ప్రజాజ్యోతి):** చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో భూ వివాదం ఉద్రిక్తతలకు దారితీసింది. స్థలం యజమాని వారసులమంటూ కొందరు వ్యక్తులు స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్, సిమెంట్ పోల్స్‌ను ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటుచేసుకోవడంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా ఖాళీ స్థలం చుట్టూ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల ఎత్తుగడలు నడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 1985లో పసుపుల ఎల్లయ్య అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు 400 గజాల స్థలాన్ని చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఇంటి నిర్మాణంలో భాగంగా వాస్తు ప్రకారం కొంత భాగాన్ని వెనుక వైపు ఖాళీగా వదిలి ముందుభాగంలో ఇంటిని నిర్మించుకున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిగిలిన స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టకుండా ఖాళీగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇదే ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు లక్ష్యంగా చేసుకుని గత కొన్ని నెలలుగా స్థానిక వార్డు మెంబర్ వివిధ రకాల ఒత్తిడులు, ఎత్తుగడలు ప్రారంభించారని బాధితులు ఆరోపిస్తున్నారు. స్థలంపై నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ విషయంలో పలుమార్లు వార్డు మెంబర్‌తో వాగ్వాదాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో వార్డు మెంబర్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేసినట్లు బాధితులు వెల్లడించారు. అదే సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూమికి సంబంధించిన పత్రాలు, రికార్డులను పరిశీలించినట్లు బాధితులు పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు స్థలం యజమాని వారసుల పేరుతో ముందుకు వచ్చి కుటుంబ సభ్యులపై ఒత్తిడి, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గురువారం ఉదయం స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్, సిమెంట్ పోల్స్‌ను ధ్వంసం చేసి దౌర్జన్యానికి దిగారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారని తమ ఆస్తికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై మరోసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేసినట్లు బాధితులు తెలిపారు. భూ వివాదం వెనుక రాజకీయ ప్రేరేపణలు ఉన్నాయా..? లేక నిజంగా వారసత్వ హక్కుల అంశమా..? అన్న కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ››› శంకరుడి చాణిక్య వ్యూహాలతో ముదురుతున్న భూ వివాదం

స్థానిక వార్డు సభ్యుడు శంకర్ వ్యవహార శైలి కారణంగానే విద్యానగర్‌లో భూ వివాదం రోజు రోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొదట ఖాళీ స్థలంపై వివిధ మార్గాల్లో బాధితులపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇప్పుడు స్థలం వారసులు పేరుతో కొత్త వ్యూహాలకు తెరలేపుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నేరుగా జోక్యం చేసుకోవడం కంటే ఇతరులను ముందుకు నెట్టి వివాదాన్ని మరింత రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పలు మార్లు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు విఫలమవడంతో ఇప్పుడు వారసత్వ హక్కుల పేరుతో కొత్త కోణాన్ని సృష్టించి కుటుంబ సభ్యులపై ఒత్తిడి పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్, పోల్స్ ధ్వంసం ఘటన కూడా వార్డు మెంబర్ ముందస్తు ప్రణాళికలో భాగమేనని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రాజకీయ ప్రభావాన్ని అడ్డంగా పెట్టుకుని బాధిత కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వార్డు సభ్యుడి వైఖరి కారణంగానే చిన్న స్థాయి వివాదం ఇప్పుడు పెద్ద స్థాయికి చేరుకుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి అసలు నిజాలు వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.

### ››› భూ వివాదంతో నాకు ఎలాంటి సంబంధం లేదు : వార్డు మెంబర్ మాలోత్ శంకర్



విద్యానగర్ గ్రామ పంచాయతీ 8వ వార్డు పరిధిలో ఉన్న ఖాళీ స్థలం వివాదంతో తనకు ఎటువంటి సంబంధం లేదని వార్డు సభ్యుడు మాలోత్ శంకర్ స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనపై బురద జల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పసుపుల ఎల్లయ్య వారసులు హనుమంతు కుటుంబ సభ్యులు మ రియు సెనగ స్వామి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతుండగా పరిస్థితి అదుపు తప్పకుండా చూడటానికే అక్కడికి వెళ్లానని తెలిపారు. ఎల్లయ్య వారసు లు వయసులో పెద్దవారు కావడంతో వారిపై ఎలాంటి దాడులు జరగకుండా అ డ్డుగా మాత్రమే నిలిచినట్లు చెప్పారు. స్థలం విషయంలో తనకు ఎలాంటి వ్యక్తిగత సంబంధం లేదని భూమి ఎవరిదైనా సంబంధిత అధికారుల ఎదుట ఆధారాలతో నిరూపించుకోవాలని అవసరమైతే కోర్టును ఆశ్రయించాలని సూచించినట్లు పేర్కొన్నారు. స్థలం కబ్జా ఆరోపణల్లో తనకు గానీ తన పార్టీకి గానీ ఎటువంటి సం బంధం లేదని స్పష్టం చేశారు. అసత్య ఆరోపణలతో తన ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే ఊరుకోబోమని వార్డు మెంబర్ మాలోత్ శంకర్ హెచ్చరించారు.

# దానవాయిపేటలో బడి బాట కార్యక్రమం



**చర్ల, మే 14:(ప్రజాజ్యోతి ):** చర్ల మండలం ఆర్. కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దానవాయిపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడమే 'బడి బాట' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. ఆర్ కొత్తగూడెం గ్రామ సర్పంచ్ తుర్రం రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. విద్య ద్వారానే పిల్లలకు మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.దానవాయిపేట పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'విద్య మా హక్కు', 'మీ పిల్లలను మన పాఠశాలలో చేర్పించండి' వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది.ఈ కార్యక్రమం జూన్ 6 నుండి జూన్ 19 వరకు కొనసాగుతుందని 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవికుమార్, వార్డు సభ్యురాలు కణితి రజని, ఉపాధ్యాయులు చింతకాయల హరిబాబు, రాజు, సుహాసిని, పీసా మొబిలైజర్ రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సహకార ఎన్నికల కోసం రైతుల రాస్తారోకో



**చర్ల, మే 14:(ప్రజాజ్యోతి ):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏ ఐ కె ఎస్ ) ఆధ్వర్యంలో గురువారం చర్ల రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కల్లూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే చర్లలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 908 సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పాలక మండళ్ల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి సహకార సంఘంలో పాలకపార్టీ కాంగ్రెస్‌కు చెందిన సభ్యులను అధ్యక్షులు డైరెక్టర్లుగా నామినేట్ చేసుకునేందుకు చర్యలు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. నామినేటెడ్ వ్యవస్థకు పూర్తి స్థాయి చట్టబద్ధత లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243జెడ్ హెచ్ ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ రాస్తారోకో కార్యక్రమంలో సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి పోతయ్య, సహాయ కార్యదర్శులు, రైతు సంఘం నాయకులు కోటి ముత్యాలరావు, కోడిరెక్కల రాజారావు, చల్లా లక్ష్మీ నారాయణ, కట్టం నాగేశ్వరరావు, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, కొమరం మంగయ్య, చెన్నం సాంబశివరావు, సోడి కన్నయ్య, సోడి లక్ష్మయ్య, మడివి దేవయ్య, ప్రమీల, నాగేష్, దుర్గయ్య, రాజేష్, నరసింహారావు, శ్రీను, రమణయ్య, దుర్గాప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

- బైక్ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ, మే 14,(ప్రజాజ్యోతి)** మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల మితిమీరిన నిర్లక్ష్యం వెరసి ఒక నిండు ప్రాణం మీదకు తెచ్చింది. జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా మట్టి కుప్పలు వేయడం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు __ పాల్వంచ నుంచి నవభారత్ వైపు పాషా అనే వ్యక్తి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా, స్పాంజ్ ఐరన్ కర్మాగారం గేటు ఎదురుగా ఉన్న మూలమలుపు వద్ద ఒక్కసారిగా మట్టి కుప్పను ఢీకొట్టారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల కోసం జాతీయ రహదారి పక్కనే తవ్వకాలు చేపట్టిన కాంట్రాక్టర్లు, ఆ మట్టిని రోడ్డుపైనే కుప్పలుగా పోశారు. మలుపు వద్ద మట్టి కుప్ప ఉండటం గమనించకపోవడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పాషాకు తలకు, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల ఆగ్రహం: అధికారుల తీరుపై పట్టణ ప్రజలు ఈ విధంగా ___ ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు మిషన్ భగీరథ విభాగంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై పనులు జరుగుతున్నప్పుడు కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ,లేదా రేడియం సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు, తవ్విన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించకుండా, వాహనదారులకు అడ్డంగా రోడ్డుపైనే ఉంచడం కాంట్రాక్టర్ల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని వారు ఆరోపిస్తున్నారు. పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించాల్సిన అధికారులు కళ్ళు మూసుకుని కూర్చున్నారని, కాంట్రాక్టర్ల ఇష్టానుసారంగా పనులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మిషన్ భగీరథ పనుల పేరుతో సామాన్యుల ప్రాణాలను బలితీసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బాధ్యులైన కాంట్రాక్టరుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ముద్దు నిద్రను వీడి తగు భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కొలికిపోగు ఇస్త్రయ్య సేవలు చిరస్మరణీయం

- ముష్టిబండలో సిపిఎం నేత 12వ వర్ధంతి సభ



**దమ్మపేట, మే 14(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలం,ముష్టిబండ గ్రామంలో అమరజీవి కామ్రేడ్ కొలికిపోగు ఇస్త్రయ్య 12వ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభకు జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఇస్త్రయ్య స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి నివాళులర్పించారు. మాజీ జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కార్మికులు, నిరుపేదల హక్కుల కోసం ఇస్త్రయ్య జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. భూస్వాముల దోపిడీ, పెత్తందారీకి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. దళితుల పక్షాన నిలబడి "దళిత పులి"గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సిపిఎం పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, జగపతి, సుమంత్, నారపోగు అనిల్‌కుమార్, జగన్నాథ శ్రీనివాసరావు, తంగెళ్లమూడి రమేష్, నాగు, ఉడుతనేని విశ్వేశ్వరరావు, రవికుమార్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఏ పంట పండించిన మద్దతు ధరకు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ









- మీకు తలవంచి పాదాభివందనం చేస్తున్న
- ఈ ప్రాంతానికి ఎంతో రుణపడి ఉన్న
- అక్షర క్రమంలోనే కాదు వ్యవసాయ అభివృద్ధిలోనూ అశ్వారావుపేట ముందుంది
- కేంద్ర ప్రభుత్వం రైతులతో రాజకీయం చేస్తోంది
- ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా నిలబడ్డారు.
- సైకిల్ కూడా వెళ్లలేని గ్రామాలకు నా గిరిజన బిడ్డలు ఈరోజు బెంజ్ కార్ లో వెళ్తున్నారు
- 23 జిల్లాల మంత్రులు పోటీ పడిన పూజ్యులు ఎన్టీఆర్ నాకు వ్యవసాయ కళాశాలను ఇచ్చారు.
- మీ బిడ్డలు చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటే నా హృదయం నిండిపోతుంది.... తుమ్మల నాగేశ్వరావు...రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి
- విజయవంతమైన రైతుల ఆత్మీయ సమ్మేళనం, తరలివచ్చిన 15 జిల్లాల రైతులు
- మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తుమ్మలను సత్కరించి, అభినందించిన రైతులు
- వ్యవసాయ కళాశాల మీ దూర దృష్టికి నిదర్శనం
- ఆయిల్ ఫామ్ కు ఆయనే ఆరాధ్యుడు .... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అశ్వారావుపేట, మే 14, ప్రజాజ్యోతి :** రైతు సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో రైతుల కోసం లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తు, ఖర్చులు చేస్తున్నామని, 40 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో భద్రాచలం శ్రీ సీతారామ చంద్రుడి దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో ముందుంచే భాగ్యం దక్కిందని ఆ అవకాశం ఇచ్చిన మీ అందరికీ పాదాభివందనం చేస్తున్నానని, మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని రాష్ట్ర వ్యవసాయ సహకార చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం అశ్వారావుపేటలో నిర్వహించిన ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో 15 జిల్లాల నుంచి రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గుమ్మం అశ్వారావుపేట అక్షర క్రమంలోనే కాదు, వ్యవసాయ అభివృద్ధిలోను ముందంజలో ఉందన్నారు. రైతు ఏ పంట పండించినా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, ఈ విషయం ప్రతి ఒక్క రైతు సోదరుడికి తెలుసన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అని నమ్మే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులతో రాజకీయం చేస్తోందని, వారికి అవసరమైన యూరియా వంటి ఎరువుల విషయంలో కావాలని రాష్ట్రాన్ని ఇబ్బందులు పెడుతుందన్నారు. పశ్చిమాస్య దేశాలలో యుద్ధాలు జియో పాలిటిక్స్ వల్ల యూరియా సరఫరా లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం సరైన సమయంలో స్పందించడం లేదన్నారు. ఇతర దేశాల నుంచి పంటలను దిగుమతి చేసుకోవద్దని ప్రధానమంత్రి మోడీకి స్పష్టంగా చెప్పినా, అమెరికా నుంచి మొక్కజొన్న, పత్తి దిగుమతులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఇతర దేశాల నుండి రూ 1.66 కోట్ల మెట్రిక్ టన్నులు పామాయిల్ దిగుమతి చేసుకుంటున్నామని, అందుకోసం లక్షల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామన్నారు.

ఆయిల్ ఫామ్ సాగు ద్వారా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా బలపడుతున్నాయని, ప్రతి రైతు పామ్ ఆయిల్ సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో సైకిల్ కూడా వెళ్లలేని గిరిజన గ్రామాల్లో నేడు గిరిజన యువత బెంజ్ కార్లలో ప్రయాణించే స్థాయికి ఎదిగిందని చెప్పారు. ఆదివాసి బిడ్డలకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో నెంబర్ 3 తెస్తే ఈ ప్రాంత ఆదివాసి బిడ్డలకు ఎందరో ఉద్యోగాలు వచ్చాయన్నారు. తన రాజకీయ జీవితాన్ని స్మరించుకుంటూ, "23 జిల్లాల మంత్రులు పోటీ పడినప్పటికీ దివంగత ముఖ్యమంత్రి, పూజ్యులు నందమూరి తారక రామారావు నా ప్రాంతానికి వ్యవసాయ కళాశాలను ఇచ్చారు" అని గుర్తుచేశారు. "మీ పిల్లలు చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకుంటే నా హృదయం నిండిపోతుంది" అని మంత్రి భావోద్వేగంగా పేర్కొన్నారు. పదవి ఉన్నా లేకున్నా రైతు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేశానని,ఎన్ని పదవులు చేశామని కాకుండా భవిష్యత్ తరాలకు ఎంత మేలు చేశామన్నదే నా రాజకీయ ప్రస్థానంలో నేను ఆలోచిస్తానన్నారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రజల అభివృద్ధికే పాటుపడతానన్నారు.రాజకీయ ప్రస్థానంలో మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫామ్ రైతులు ఘనంగా సత్కరించారు.

**››› వ్యవసాయ కళాశాల మీ దూర దృష్టికి నిదర్శనం.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**

రాష్ట్ర అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. వ్యవసాయ కళాశాల స్థాపన ఆయన దూరదృష్టికి నిదర్శనమని, ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో దేశ విదేశాలలో స్థిరపడ్డారన్నారు. ఆయిల్ ఫామ్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి రైతులకు ఆదర్శంగా నిలిచిందని, ఆయిల్ ఫామ్ సాగుకు ఆరాధ్యుడు తుమ్మలేనని అన్నారు మారుమూల గ్రామాలకు సైతం రహదారుల, పాఠశాలలు, వాటర్ ట్యాంకులు, వంటి మౌలిక సదుపాయాలు చేపట్టి గ్రామీణాభివృద్ధికి బాటలు వేసిన ఘనత తుమ్మలదేనని అభినందించారు. ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

ఈ సమ్మేళనంలో వివిధ జిల్లాల రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె సురేంద్రమోహన్, కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ దండా రాజిరెడ్డి, అగ్రికల్చరల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జానయ్య, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ షేక్ యాస్మిన్ భాష, కాంగ్రెస్ నాయకులు బండి భాస్కర్, పలువురు ఉన్నతాధికారులు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన కళాశాల ఏర్పాటుతో ...
# ఈ ప్రాంతం ఎలా అభివృద్ధి చెందుతుంది

- **కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ దండ రాజిరెడ్డి తో ప్రజాజ్యోతి ముఖాముఖి**



**అశ్వారావుపేట, మే 14, ప్రజాజ్యోతి :**

**1.ప్రజాజ్యోతి : ఈ ప్రాంతంలో ఉద్యానవన కళాశాల అవసరాన్ని ఎలా చూస్తారు..?**

**వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి :** ఈ ప్రాంతంలో అన్ని రకాల ఉద్యానవన పంటలకు అనుకూలమైన వాతావరణంతో పాటు నేలలు కూడా పంట మంచి దిగుబడి అనుకూలంగా ఉంటాయి. ఇక్కడ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పంటలపై అవగాహన పెరుగుతుంది అంతేకాకుండా రైతులకు శాస్త్రవేత్తల పర్యటనల ద్వారా అవసరమైన సలహాలను అందించినట్లు అవుతుంది. తద్వారా విద్యార్థులతో పాటు రైతులకు కూడా కళాశాలతో ఉపయోగం ఉంటుంది

**2.ప్రజాజ్యోతి : ప్రస్తుత కళాశాల ప్రారంభానికి అన్ని వసతులు ఉన్నాయా..**

**వైస్ ఛాన్సలర్, రాజిరెడ్డి :** ఇప్పుడు కళాశాల ప్రారంభించడానికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేదు . ల్యాబ్ లను కూడా సిద్ధం చేస్తున్నాం

**3.ప్రజాజ్యోతి : ఎంతమంది విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమవుతుంది...?**

**వైస్ ఛాన్సలర్, రాజిరెడ్డి:** ఈ సంవత్సరం 30 మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభానికి ఏర్పాటు చేస్తున్నాం.. అవసరాన్ని బట్టి వచ్చే సంవత్సరం 60 మంది వరకు విద్యార్థులకు అవకాశం ఉంటుంది

**4.ప్రజాజ్యోతి : విద్యార్థినీ విద్యార్థులకు వస్తి గృహాలతో సహా ఎన్ని సంవత్సరాల్లో పూర్తి చేస్తారు**

**వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి :** అభివృద్ధి పనులు, ముఖ్యమైన వాటిపై ప్రభుత్వానికి అనుమతుల కోసం పంపించాం త్వరలోనే పనులు ప్రారంభించి, రాబోయే 4 సంవత్సరాల్లో సకల సదుపాయాలతో పూర్తిస్థాయిలో కళాశాలను అందుబాటులోకి తీసుకొస్తాం

**5.ప్రజాజ్యోతి :ఉద్యానవన పంటలు ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేయడాన్ని మీరేలా చూస్తారు...?**

**వైస్ ఛాన్సలర్, రాజిరెడ్డి:** అశ్వారావుపేట నుండి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం వంటి ముఖ్య పట్టణాలకు అనుసంధానమైన రహదారి మార్గాలు ఉండటం వల్ల ఈ ప్రాంతంలో అరటి, పామాయిల్, కొబ్బరి, మామిడి, జీడిమామిడి వంటి ఉద్యానవన పంటలు రైతులు ఎక్కువగా సాగు చేస్తూ లాభాలను అందిపుచ్చుకుంటున్నారు.

**6.ప్రజాజ్యోతి ప్రశ్న :లాభదాయక పంటలపై రైతులకు మీరిచ్చే సూచనలు ఏంటి**

**వైస్ ఛాన్సలర్, రాజిరెడ్డి:** రైతులు వరి పత్తి వంటి పంటల నుండి ఉద్యానవన పంటల వైపు దృష్టిసారించాలి ముఖ్యంగా ఆయిల్ ఫామ్ వంటి పంటలకు ప్రకృతి వలన నష్టాలు లేకపోవడం వలన రైతులకు ఇబ్బంది ఉండదు. రైతులు కూడా ఆర్థికంగా నిలబడే అవకాశం ఎక్కువ ఉంటుంది

## వ్యవ" సాయంగా" ఉంటుంది

- **ఉద్యానవన కళాశాలతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది... రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల**
- **ఎమ్మెల్యే జారే తో కలిసి ఉద్యానవన కళాశాలను ప్రారంభించిన మంత్రి తుమ్మల**





**అశ్వారావుపేట, మే 14, ప్రజాజ్యోతి :** ఉద్యానవన కళాశాల ప్రారంభంతో రైతులకు వ్యవసాయానికి అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ చేనేత సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక శాసన సభ్యులు జారే ఆదినారాయణ తో కలిసి శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యానవన పరిశోధన కేంద్రం ఆవరణంలో ఉద్యానవన కళాశాలను ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ఉద్యాన పంటలపై శాస్త్రీయ అవగాహన కల్పించడంలో ఈ కళాశాల కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశోధన అవకాశాలు కూడా లభిస్తాయని, ప్రాంతీయ యువతకు వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఉద్యానవన రంగంలో నూతన సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడంలో కళాశాల సహకరిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ కళాశాల ఏర్పాటుతో అశ్వారావుపేట విద్యా, వ్యవసాయ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివిధ శుభకార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె







**దమ్మపేట, మే 14(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలో నిర్వహించిన పలు శుభకార్యక్రమాలలో ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.ముందుగా పెద్దగొల్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు రావుల అప్పారావు – సార్లమ్మ దంపతుల కుమార్తె సాయిదుర్గ ఓణీల వేడుకకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం లచ్చాపురం గ్రామంలో కోట కన్నారావు – మౌనిక దంపతుల కుమారుడు శివాన్స్ అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.తదుపరి నాగుపల్లి గ్రామంలో ఇస్లావతు సర్వేశ్వరరావు – తిరుపతమ్మ దంపతుల కుమారుడు మురళీకృష్ణ, పూజితల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో విద్యకు ప్రాధాన్యం

- **జడ్పీహెచ్ఎస్ నాచారంలో తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశం**
- **ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘన సన్మానం**





**దమ్మపేట, మే 14 (ప్రజాజ్యోతి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాచారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ జగపతి , గ్రామ సర్పంచ్, ఏఏపీసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. 540 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందిన కుమారి భార్గవి, 532 మార్కులు సాధించి ద్వితీయ స్థానం పొందిన కుమార్ ఆకాష్‌లకు సభా వేదికపై ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా వక్తలు సూచించారు.అనంతరం నిర్వహించిన “బడిబాట” అవగాహన ర్యాలీలో గ్రామ పెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో విద్య ప్రాధాన్యతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చిన్నంశెట్టి

- **అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తా... చిన్నంశెట్టి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు**



**అశ్వారావుపేట, మే 14, ప్రజాజ్యోతి:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. మండలంలోని అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని రానున్న అన్ని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. మండల అధ్యక్షుడుగా నియమించేదుకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట ప్రసన్న, స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణకు అభినందనలు తెలియజేశారు.

# పాల్వంచలో మాజీ మంత్రి వనమాను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**పాల్వంచ, మే 14, ప్రజాజ్యోతి:** మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావును తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్వంచలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు నలభై సంవత్సరాల రాజకీయ జీవితాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. గత నలభై ఏళ్లుగా కొనసాగుతున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఇద్దరు నాయకులు పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. అలాగే వనమా వెంకటేశ్వరరావు యాభై సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులుగా ప్రజలకు అందించిన సేవలను మంత్రి తుమ్మల కొనియాడారు. కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల మనసుల్లో వనమా చెరగని ముద్ర వేసుకున్న ప్రజానాయకుడని ప్రశంసించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వనమా దంపతులను శాలువాతో సన్మానించి, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, తుమ్మల మరియు వనమా అభిమానులు పాల్గొన్నారు.

# దమ్మపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో డీఏఓ ఆకస్మిక తనిఖీ

- లారీలు లేక 3 వేల బస్తాల ధాన్యం నిల్వ.. వెంటనే చర్యలకు ఆదేశం
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు : అధికారులకు డీఏఓ ఆదేశాలు



**దమ్మపేట, మే 14(ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం నిల్వ పరిస్థితులు, కాంటాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.రైతులు ధాన్యాన్ని శుభ్రపరచుకుని తీసుకురావాలని సూచించిన జిల్లా వ్యవసాయ అధికారి, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత జీసీసీ ఇన్‌చార్జిని కాంటాల పరిస్థితులు, లారీల రవాణా ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా లారీలు అందుబాటులో లేకపోవడంతో సుమారు 3 వేల బస్తాల ధాన్యం కాంటాలలో నిల్వ ఉండిపోయిందని సెంటర్ ఇన్‌చార్జి వివరించారు. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే మూడు లారీలను పంపించాలని కోరారు.రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. రవికుమార్, దమ్మపేట మండల వ్యవసాయ అధికారి, పీఏసీ సెంటర్ ఇన్‌చార్జి పోలారావు, ఏఈఓ ఆరేపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజానాట్య మండలి భద్రాద్రి జిల్లా నూతన కమిటీ ఎన్నిక.



**పాల్వంచ, మే 16, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రజానాట్య మండలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభలు మే 13న పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో శనిగారపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యస్కే సాబీర్ పాషా, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కాటూరి రాము, అధ్యక్షుడు శనిగారపు శ్రీనివాస్, కార్యదర్శి నిమ్మల రాంబాబు, ఉపాధ్యక్షులు మేదిని లక్ష్మీ, కటకం కొమరయ్య, సహాయ కార్యదర్శులు దార్ల లక్ష్మీ, కోటమర్తి శ్రీనివాస్, వజ్జా రాజేశ్వరి, కోశాధికారి రామడుగు రామాచారి, సభ్యులుగా అల్లి వెంకటేశ్వర్లు, సత్యశ్రీను, ఇరుకు రామారావు, హెచ్ వెంకన్న, పగిడిపల్లి సంజీవరావు, కేలోత్ క్రిష్ణ, కాకటి స్వరూప, తాటి నాగరాజు, భూక్యా బిక్కులాల్, కోట సుందరరావులను ఎన్నుకున్నారు. ఈ సభలో సిపిఐ పాల్వంచ మండల కార్యదర్శి కామ్రేడ్ వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఏఐటియుసి జిల్లా నాయకుడు అన్నారపు వెంకటేశ్వర్లు సందేశ ప్రసంగాలు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి.

- --కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి.



**పాల్వంచ, మే 14, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్లను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలు, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఆకుల పద్మలత, ఉపాధ్యాయులు, వార్డు ఆఫీసర్ నరేష్, పాఠశాల ఆదర్శ అమ్మడీవెన కమిటీ చైర్మన్ జి. అదిలక్ష్మి, గ్రామస్తులు మసనం శరత్, బూసి శ్రీను, యాటానాని, బందారు తేజ, జి. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.


# బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

- బీఎస్పీ జిల్లా కమిటీ డిమాండ్



**పాల్వంచ, మే 14 ( ప్రజాజ్యోతి )** మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం పాల్వంచలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు యాసం సిద్దార్థ పూలే మాట్లాడుతూ పోక్సో కేసు నమోదై వారం రోజులు గడిచినా ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంతెన రవి, అబ్దుల్ హమీద్, పసుపులేటి రామ్‌చందర్, కాల్వ ప్రవీణ్, ఎండీ ఖాజా, జంగం లోకేష్ పాల్గొన్నారు.

# భగవద్గీత సప్తాహ వేడుకలు ప్రారంభం



**చర్ల, మే 14:(ప్రజా జ్యోతి):** చర్ల లోని శ్రీ వాణి విద్యానికేతన్ పాఠశాలలో భగవద్గీత సప్తాహ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు, విద్యార్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై భక్తి భావంతో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ప్రత్యేక అలంకరణలతో ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హరే కృష్ణ ప్రచార కేంద్రం, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుండి హాజరైన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగకర్త కృష్ణదాస్ తొలి రోజు భగవద్గీత పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. భగవద్గీత అనేది కేవలం హిందువుల పవిత్ర గ్రంథం మాత్రమే కాకుండా ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా నిలిచే దివ్య జ్ఞానసాగరమని ఆయన పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన గీతా సందేశాలు నేటి సమాజానికి సమానంగా వర్తిస్తాయని చెప్పారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు, ఆందోళనలు, కష్టసుఖాలను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక బలాన్ని గీతా బోధనలు అందిస్తాయని వివరించారు. ప్రస్తుత కాలంలో యువత ఆధ్యాత్మికతకు దూరమవుతున్నారని, అలాంటి సమయంలో భగవద్గీత సందేశాలు వారికి సన్మార్గాన్ని చూపుతాయని తెలిపారు. ధర్మం, కర్తవ్యం, నిజాయితీ, భక్తి, మానవతా విలువలను గీత ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. భగవంతునిపై విశ్వాసం పెంపొందించుకొని జీవితాన్ని సద్గుణాలతో నడిపిస్తే మానసిక ప్రశాంతతతో పాటు విజయాన్ని కూడా సాధించవచ్చని సూచించారు. ప్రతి ఇంటిలో గీతా పారాయణం జరగాలని చిన్నారులకు చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మిక విలువలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు గీతా బోధనల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రత్యేక సందేశాలు అందించారు. భక్తులు "హరే కృష్ణ" నామస్మరణతో భక్తిరసంలో తేలియాడారు. ఈ భగవద్గీత సప్తాహ వేడుకలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయని అన్నారు. 20వ తారీఖు వరకు ప్రతిరోజు సాయంత్రం 5.30నుండి 7:30 వరకు భగవద్గీత సప్తాహ కార్యక్రమం నిర్వహించబడుతుందని కమిటీ సభ్యులు తెలియచేసారు. మొదటిరోజు భక్తులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజాసేవలో 40 వసంతాలు

- మంత్రి తుమ్మలకు ఘన సన్మానం
- శాలువాతో సత్కరించిన పోలిన లంక రాజు

**చర్ల, మే 14:(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న రాష్ట్ర మార్కెటింగ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజాసేవలో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాచలంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోలిన లంక రాజు మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తుమ్మల నాగేశ్వర రావు తన క్రమశిక్షణ, పరిపాలనా దక్షత ప్రజల సమస్యలపై ఉన్న అవగాహనతో రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట గుర్తింపు పొందారని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగుతూ పలు కీలక పదవులు నిర్వహించిన ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి తుమ్మల చేసిన సేవలు ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేనివని, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగ బలోపేతం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు వేలాది మంది రైతులు, సాధారణ ప్రజలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనను ప్రజలు అభివృద్ధి ప్రదాతగా అభివర్ణిస్తుంటారని అన్నారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలిన లంక రాజు, సుందరి సురేష్, పోట్రూ బ్రహ్మానంద రెడ్డి తదితరులు మంత్రి తుమ్మల నాగేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు కార్యకర్తల సహకారమే తన రాజకీయ ప్రస్థానానికి బలమని పేర్కొన్నారు. ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని భవిష్యత్తులో కూడా ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోలిన లంక రాజును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.





# రహదారిపై భారీ వాహనాల నిలుపుదలపై నిషేధం

- సర్పంచ్ బోడ బాలు నాయక్



**టేకులపల్లి,మే14, ప్రజాజ్యోతి:** టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సర్పంచ్ బోడ బాలు నాయక్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. టేకులపల్లి భారత్ పెట్రోల్ బంక్ నుండి గోలియతండ హెచ్.పి. పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ వాహనాలను నిలపడంపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గత 20 రోజుల్లో ఈ మార్గంలో 10 ప్రమాదాలు జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గత వారం జరిగిన ప్రమాదాల్లో రెండు బర్రెలు మృతి చెందడం జరిగింది.ఇదే రహదారిపై జరిగిన ప్రమాదంలో కిరాణం హోల్‌సేల్ వ్యాపారి రాయల రాజేష్ మృత్యువాత పడటం పట్ల సర్పంచ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.రోడ్డు పక్కన నిలుపుతున్న భారీవాహనాల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఈ ఘోర ప్రమాదాలు జరుగుతు న్నాయని ఆయన పేర్కొన్నా రు.నిబంధనలు ఉల్లంఘించి రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపితే యజమానులకు భారీ జరిమానా విధించబడు తుంది.మండల కేంద్రంలోని ఎంపీడీవో, తాసిల్దార్,పోలీస్ శాఖ అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. వాహనదారులు, డ్రైవర్లు ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.నిరంతరం ప్రమాదాలు జరుగుతున్న ఈ బ్లాక్ స్పాట్ వద్ద అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని టేకులపల్లి మండల ప్రజలు, సర్పంచ్ బోడ బాలు నాయక్ డిమాండ్ చేశారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

- మతి స్థిమితం లేని మహిళకు అండగా నిలిచిన సఖి బృందం
- పది రోజులుగా బట్టలు లేక తిరుగుతున్న మహిళకు ఆహారం, దుస్తులు, వైద్యం ఏర్పాటు
- మానవ సేవే మాధవ సేవను చాటిన అధికారులు, సేవా సంస్థలు




**కొత్తగూడెం /సుజాతనగర్, మే 14 ( ప్రజాజ్యోతి )** సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉందని చాటిచెప్పే ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో చోటుచేసుకుంది. గత పది రోజులుగా మతి స్థిమితం కోల్పోయిన ఓ మహిళ బట్టలు లేకుండా రోడ్లపై తిరుగుతుండగా స్థానికులు గమనించినప్పటికీ ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో ఒక మహనీయుడు మహిళా హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించడంతో అధికారులు, సేవా సంస్థలు వెంటనే స్పందించి ఆమెకు అండగా నిలిచారు. సుజాతనగర్‌కు చెందిన వెంకటరావు అనే వ్యక్తి మహిళా హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి మహిళ తీవ్ర దయనీయ పరిస్థితిలో తిరుగుతోందని సమాచారం అందించారు. వెంటనే జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ( డి. డబ్ల్యూ ఓ ) సహకారంతో సఖి బృందం అక్కడికి చేరుకుని ఆ మహిళను గుర్తించింది. ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్న సఖి సిబ్బంది ముందుగా ఆహారం అందించి ప్రేమగా మాట్లాడి నచ్చజెప్పి ఆమెకు దుస్తులు తొడిగించారు. అనంతరం సరైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. మతి స్థిమితం కోల్పోయిన నిరాశ్రయులకు సేవలు అందిస్తూ మానవ సేవే మాధవ సేవ అనే భావనతో పనిచేస్తున్న ఖమ్మం అన్నం ఫౌండేషన్ సభ్యుడు శ్రీనివాస్‌ను పిలిపించి మహిళను ఆయనకు అప్పగించారు. ఆమెకు వైద్య చికిత్స అందించి పరిస్థితి మెరుగుపడిన అనంతరం కుటుంబ సభ్యులను గుర్తించి వారితో కలిపే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ పరిసర ప్రాంత ప్రజలు కూడా సహకారం అందించారు. ప్రతిరోజూ ఆ మహిళ పరిస్థితిని గమనిస్తూ బాధపడిన స్థానికులు, చివరకు అధికారులు స్పందించి ఆమెకు రక్షణ కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. సమాజంలో నిరాధారులు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని చిన్నచూపు చూడకుండా వారికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

# ఏ బి ఏ ఎస్ హాజరు తప్పని సరిగా వేయాలి

- అనుమతులు లేకుండా వైద్యులు సెలవులు తీసుకోరాదు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్యం అందించాలి
- డి ఎం అండ్ హెచ్ ఓతుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 14 ,(ప్రజా జ్యోతి )** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, అదేవిధంగా ఏ బి ఏ ఎస్ హాజరు తప్పనిసరిగా వేయాలని డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ జిల్లాలోని పలువురు వైద్యులకు సూచించారు, గురువారం డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో జరిగిన వైద్యాధికారుల జామ్ మీటింగ్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూనార్మల్ డెలివరీ మోటివేషన్ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయడం ద్వారా భద్రాద్రి జిల్లాలో గర్భిణీ స్త్రీలలలో సాధారణ ప్రసవాలు ఎక్కువ శాతం అయ్యేలాగా యోగాసనాలు నేర్పించాలని , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు, అదేవిధంగావైద్యాధికారుల అనుమతి లేకుండా సెలవులు తీసుకోరాదని, మూడు రోజులకుపైగా సెలవులు ఉంటే ముందస్తు ఆమోదం తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రతి రోజు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మెడికల్ ఆఫీసర్లు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై బాధ్యత నిర్ణయించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సి ఆర్ ఎం టీం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించి జిల్లాలో అత్యధికంగా సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని రిపోర్టు ఇవ్వడం వలన , సాధారణ ప్రసవాలు పెంచడానికి, సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించడానికి, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారుసాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో “నార్మల్ డెలివరీ మోటివేషన్ గ్రూపులు” ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గర్భిణీలకు ఆరోగ్య విద్య అందిస్తూ సురక్షిత ప్రసవాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరం లేని సిజేరియన్ ప్రసవాలను తగ్గించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.గర్భిణీలకు ఏ ఎన్ సి క్లినిక్స్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, రక్తహీనత నివారణ, బాలల ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, ఊబకాయం నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అదేవిధంగా ప్రారంభ దశలోనే గర్భాన్ని గుర్తించే నిశ్చయ పరీక్షలు నిర్వహించి, వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు.ఆశా కార్యకర్తల హాజరు వివరాలను ప్రతి నెలా నమోదు చేసి వేతన బిల్లులు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి నెల రెండో గురువారం సబ్ సెంటర్లలో , మూడో గురువారం హెచ్ సి లలో శ్రమదానం – పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఔషధ నిల్వలను సక్రమంగా నిర్వహిస్తూ ఏ ఆర్ వి, ఏ ఎస్ వి మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఏ ఈ ఎఫ్ ఐ కిట్ ప్రతి పి హెచ్ సి తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆర్.టి.ఐ బోర్డులు, ఎం సి పి కార్డులు, హెచ్ ఎం ఐ ఎస్ నమోదు తదితర రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సమావేశంలో అధికారులు ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలియజేశారు జూన్ ఒకటో తేదీ నుండి ఏ బి ఏ ఎస్ హాజరు ప్రతిపాదికన ఉద్యోగులకు జీతాలు చేయవలెనని ఆదేశించారు, ఉద్యోగుల జీతాల బిల్లులకు ఏ బి ఏ ఎస్ హాజరు తప్పనిసరిగా జోడించాలని ఆదేశించారు, జీతాల బిల్లులకు జిల్లా వైద్య అధికారి అనుమతి తీసుకోవాలని ఆదేశించారు, క్షేత్ర స్థాయి సిబ్బంది వారికి కేటాయించిన ఆరోగ్య కార్యక్రమాలు విధులు తప్పనిసరిగా అమలు చేయాలని వారి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు ఏ ఎన్ సి క్లినిక్ నిర్వహించడం గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు వాకప్ చేయడం వారికి ఆరోగ్యం విద్య బోధన చేయడం ద్వారా గర్భిణీ స్త్రీలను మానసికంగా సాధారణ ప్రసవం అయ్యే విధంగా వారిని తయారు చేయవలెనని, మంచి ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నుండి కాపాడవచ్చు అని తెలియజేశారుఈ కార్యక్రమంలో వైద్యులు ప్రతాప్, రాకేష్, డాక్టర్ హరీష్,నాగలక్ష్మి ,రాంప్రసాద్, లీల,జానకి పాల్గొన్నారు

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా విజయ్ కుమార్ నాయుడు

**చర్ల, మే 14:(ప్రజాజ్యోతి ):** చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా విజయ్ కుమార్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై చురుకైన పాత్ర పోషిస్తున్న విజయ్ కుమార్ నాయుడికి పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు నాయకులు తెలిపారు.విజయ్ కుమార్ నాయుడు గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమా ల్లో చురుకుగా పాల్గొంటూ మండల స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. గ్రామ స్థాయి కార్యకర్తలతో సమన్వయం కలిగి ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని కొనియాడారు.ఈ నియామకంపై వి జయ్ కుమార్ నాయుడు స్పందిస్తూ తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తె లిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి కి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటు లో ఉంటానని తెలిపారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజ య్ కుమార్ నాయుడికి అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు అందజేశా రు. ఆయన నాయకత్వంలో చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- 24న కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా 3వ మహాసభ
- మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన కమిటీ సభ్యులు



**కొత్తగూడెం, మే 14 ( ప్రజాజ్యోతి )** ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న టీయూడబ్ల్యూజే–ఐజేయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 24న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరగనున్న మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఘనంగా ఆవిష్కరించారు. మహాసభ పోస్టర్‌ను ఐజేయూ జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్‌కుమార, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వృత్తి భద్రత, సంక్షేమం, సామాజిక గౌరవం కోసం టీయూడబ్ల్యూజే–ఐజేయూ నిరంతరం ఉద్యమిస్తున్న సంఘం అని పేర్కొన్నారు. ప్రస్తుతం మీడియా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని జర్నలిస్టులపై పెరుగుతున్న ఒత్తిళ్లు, ఉద్యోగ భద్రత సమస్యలు, సంక్షేమ అంశాలపై సంఘటిత పోరాటం అవసరమని అన్నారు. జిల్లా మహాసభ వేదికగా జర్నలిస్టుల సమస్యలపై సమగ్ర చర్చ జరిగి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యతే హక్కుల సాధనకు బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యెర్రా ఈశ్వర్, ఎర్పుల సుధాకర్, బాపట్ల మురళి, భాస్కర్, షేక్ జానీ, బండ్ల వెంకట్, ఆర్ఎస్ రామానుజం, గుణ సురేష్, దశరథ్ రజ్వా, అఫ్జల్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల్లో సేవా స్ఫూర్తి..

- బిక్కు తండాలో రక్తదాన శిబిరం ఘన విజయం

**పాల్వంచ, మే 14, ప్రజాజ్యోతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కార్యక్రమాలు ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ఆధ్వర్యంలో బిక్కు తండాలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో డాక్టర్ వేముల కామేశ్వరరావు నిర్వహణలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం సహకారంతో ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బిక్కు తండా సర్పంచ్ శ్రీమతి ఝాన్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్ డి. సైదులు, అడిషనల్ టిహెచ్ఎంఓ పాల్గొని రక్తదాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ, అధ్యాపక బృందం, వైద్యులు, నర్సులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా భావాన్ని చాటుకున్నారు.ఇదే సందర్భంగా మెగా పేరెంట్ –టీచర్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులతో చర్చించారు. అలాగే కళాశాల పూర్వ విద్యార్థులు ఎస్కే జానిమియా, వెంకట్, చంద్రశేఖర్, హేమ్లా నాయక్, కరేం సాయికుమారి, ఎన్. భానుప్రియ, కె. రాంబాబులను సన్మానించారు.1998–2001 బీకాం బ్యాచ్ అలుమ్ని అసోసియేషన్ తరపున చంద్రశేఖర్ కళాశాల అభివృద్ధి కోసం రూ.10 వేల విరాళం అందజేశారు. కళాశాల యాజమాన్యం ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. మాధవి, డాక్టర్ కొండలరావు, డి. రమేష్, విజయ ప్రసాద్, డాక్టర్ శెట్టి స్వరూపరాణి, కోట్లపు శ్రీనివాసరావు, పారుల శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ లీల, ధర్మారావు, రమేష్, దీపిక, కరీమా, భాను, ప్రవీణ్, శివ, భూక్య శ్రీను, మోహన్, పవన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలి

- కార్యకర్తలే పార్టీకి వెన్నెముక : డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న
- గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలమైన శక్తిగా తీర్చిదిద్దాలి : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- కొత్తగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యుల పరిచయ సమావేశం ఘనంగా నిర్వహణ







**కొత్తగూడెం, మే 14 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యం గా పనిచేయాలని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లు, అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్న కాంగ్రెస్ శ్రేణులు ప్రజల ఆశీస్సులతో జిల్లాలో అఖండ మెజార్టీ సాధించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. గ్రామ గ్రామాన, వాడవాడలా పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి మండలంలో కాంగ్రెస్‌ను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ అధ్యక్షులను నియమించి పూర్తి స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో త్వరలోనే జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సమావేశంలో తీర్మానించారు. పెరుగుతున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, నిరుద్యోగ సమస్యలు, పరీక్ష పేపర్ లీకేజీలపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు, జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, కొత్తగూడెం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురం లలితా కుమారి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధులు వై. శ్రీనివాస్ రెడ్డి, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, రాంబాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు మంద హనుమంతు, జానీ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం. పెదబాబు, వాసం మంగయ్య దొర, పైడా రాజేంద్రప్రసాద్, లోశెట్టి నాగార్జున, జిల్లా కోశాధికారి కొదమూరు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఆంథోటి పాల్, గుడిసెల రామరాధం, వెంకటరమణారెడ్డి, ఖాదర్ బాబు, అబ్బులు, ఇల్లందు సొసైటీ చైర్మన్ చిన్నం శెట్టి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, నాయకులు చింతలపూడి రాజశేఖర్, కె. శ్రీనివాస్, గొల్ల శ్రీను, వాసు, హరి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు సహకరించాలి

- రైస్ మిల్లర్లకు కొత్వాల విజ్ఞప్తి





**పాల్వంచ, మే 14, ప్రజాజ్యోతి:** ధాన్యం కొనుగోలులో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా రైస్ మిల్లర్లు సహకరించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు కోరారు.ఈ మేరకు గురువారం ఆయన పాత పాల్వంచలోని అనాజ్ రైస్ ఇండస్ట్రీస్‌ను సందర్శించి మిల్లు యజమాని సయ్యద్ జానీమియాతో చర్చించారు. అలాగే సత్యదేవా రైస్ మిల్లు యజమాని నరిగె అభిలాష్, సంతోషిమాత రైస్ మిల్లు యజమాని పసుమర్తి నాగేశ్వరరావులతో కూడా మాట్లాడారు.ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇటీవల వాతావరణ మార్పులు, అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని కల్లాలకు తీసుకువస్తున్నారని, కాటా వేసి మిల్లులకు పంపిన తర్వాత రైతులను ఇబ్బందులు పెట్టవద్దని మిల్లర్లను కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులు, మిల్లు యజమానులతో ఇటీవల సమావేశమై ధాన్యం కొనుగోళ్లపై ఆదేశాలు జారీ చేశారని, ఆయన ఆదేశాలతో కొనుగోళ్లు వేగవంతమయ్యాయని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కొత్వాల విజ్ఞప్తిపై మిల్లర్లు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం తీసుకువచ్చిన ధాన్యాన్ని స్వీకరిస్తామని మిల్లర్లు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జి. లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కోండం వెంకన్న గౌడ్, వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.